క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాలలో ఈడీపీ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలోని ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ అధ్యాపకులకు ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈడీపీ)ను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న విద్యావసరాలకు అనుగుణంగా అధ్యాపకులు తమను తాము అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. ఆధునిక సాంకేతిక ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)ను ఉపయోగించి ఈ-కంటెంట్ డెవలప్‌మెంట్, ఈ-కంటెంట్ డెలివరీ అనే అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ శాస్త్రి, డాక్టర్ ఏఏ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరం

కంబాలచెరువు: 35వ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా డాక్టర్ వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రవాణాశాఖ కార్యాలయంలో జరిగిన ఈ శిబిరానికి అధిక సంఖ్యలో వచ్చి రక్తదానం చేశారని జిల్లా ఇన్‌చార్జి రవాణాధికారి సీహెచ్ సంపత్ కుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా రక్తదానం చేసి మరొకరికి జన్మ ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.సబిత, జి.రాధికాదేవి, కార్యాలయ పర్యవేక్షకుడు ఎల్.పెన్సిన్ బాబు, జూనియర్ అసిస్టెంట్ ఎం. విజయ బాబు, జి. సాయి సుమంత్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రకాశం నగర్: యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్పీలు, యానిమేటర్ల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. యూనియన్ అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి అధ్యక్షతన మంగళవారం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ తమకు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సీనియర్ యానిమేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం



మండపాక శ్రీను

మధురపూడి: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలు హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి మండపాక శ్రీను అన్నారు. మునగాలలోని నివాసం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా సందర్భంలో జక్కంపూడి కుటుంబం ప్రజలకు విస్తృత సేవలందించిందన్నారు. జక్కంపూడి రామ్మోహనరావు చారిటబుల్ ట్రస్టు సాయంతో కాన్సర్ రహిత నియోజకవర్గంగా రాజానగరాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంగా రాజా పనిచేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 20,178 మంది పేదలకు స్థలాలు ఇచ్చారన్నారు. 3 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు జరిపారన్నారు. వాటర్ గ్రిడ్ పేరిట రక్షిత మంచినీరందించే కార్యక్రమంలో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, పైప్‌లైన్లు ఏర్పాటు చేశారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

బలభద్రపురంలో చోరీ

బిక్కవోలు: మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కుని పారిపోయిన ఘటన మండలంలోని బలభద్రపురంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపిన వివరాల ప్రకారం బలభద్రపురానికి చెందిన బోడ సుజాత గ్రామంలోని మెయిన్‌రోడ్డు పక్కన పాన్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. మంగళవారం మధ్యాహ్నం షాపు వద్దకు బైకుపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. ఒకరు బైకుపై ఉండగా మరో వ్యక్తి వచ్చి సిగరెట్లు కావాలని అడిగాడు. సుజాత సిగరెట్లు ఇస్తుండగా సదరు వ్యక్తి ఆమె మెడలో ఉన్న రెండున్నర కాసుల బంగారు మంగళ సూత్రాల తాడు లాక్కుని అదే బైక్‌పై పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంత్రి చొరవతో సమస్యలకు మోక్షం

- వాంబేకాలనీలో సెప్టిక్ ట్యాంక్ పరిశుభ్రం
- త్వరలోనే కొత్త పైపులైన్ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేసిన కాలనీ వాసులు



వాంబే కాలనీలో సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చొరవతో అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు కొద్దిరోజుల్లోనే మోక్షం లభించింది. ముఖ్యంగా నగరపాలకసంస్థ పరిధి 17వ డివిజన్ ఐటీసీఎల్ వాంబే కాలనీలో సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి వ్యర్థాలు వెళ్లే ప్రధాన సెప్టిక్ ట్యాంక్ పూర్తిగా నిండిపోవడంతో దుర్గంధం వెలువడేది. ఈ సమస్యకు మోక్షం లభించింది. వివరాల్లోకి వెళితే.. గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం రూరల్ కార్యక్రమంలో భాగంగా ఇక్కడకు మంత్రి వేణు విచ్చేశారు. ఆ సమయంలో స్థానిక ప్రజలు సెప్టిక్ ట్యాంక్‌లు నిండిపోవడంతో పాటు మ్యాన్‌హోల్స్ పూడుకుపోవడంతో దుర్గంధం వెలువడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే దోమల బెడద భరించలేకపోతున్నామన్నారు. స్పందించిన మంత్రి వెంటనే నగరపాలకసంస్థ హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నగరపాలకసంస్థ శానిటరీ సూపర్‌వైజర్లు హుటాహుటిన ప్రధాన సెప్టిక్ ట్యాంక్‌లోని వ్యర్థాలను శుభ్రం చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో కొత్త పైపులైన్లు

అపార్టుమెంట్లలోని సెప్టిక్ ట్యాంకు పైపులైన్లు కూడా పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో కొత్త పైపులు ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను మంత్రి వేణు ఆదేశాలు జారీ చేశారు.

> **సమస్యల పరిష్కారం**
>
> మంత్రి వేణుగోపాలకృష్ణ ఐటీసీఎల్‌కు వచ్చిన తరువాత సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. నాలుగు పెద్దలైట్లను కాలనీలో వేయించారు. అపార్టుమెంట్లలో పాడైన సెప్టిక్ ట్యాంక్ పైపులైన్ల స్థానంలో కొత్తవి త్వరలోనే ఏర్పాటు చేస్తానన్నారు. మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయాల్సి ఉంది. స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేస్తే కాలనీలో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం అవుతాయి.
>
> – జువ్వల నాగిరెడ్డి, స్థానికుడు, ఐటీసీఎల్ వాంబే కాలనీ

ఈ మేరకు త్వరంలో పైపులైను ఏర్పాటు పనులను కూడా పూర్తి చేయనున్నారు. ఐటీసీఎల్ కాలనీలో రాత్రి సమయాల్లో ఆకతాయిల బెడద నేపథ్యంలో రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించాలని టూటౌన్ పోలీసులకు మంత్రి ఆదేశించారు. అలాగే రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందిల లేకుండా నాలుగు పెద్దలైట్లను నగరపాలకసంస్థ అధికారులు ఏర్పాటు చేశారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: మార్చి 9న జరగబోయే లోక్ అదాలత్‌పై వివిధ బీమా సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మంగళవారం సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో మోటారు వాహనాల ప్రమాద కేసులు పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పెండింగ్‌లోని యాక్సిడెంట్ కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయసేవాధికార సంస్థకు అప్పగించాలన్నారు. త్వరలో ముందస్తు లోక్ అదాలత్ సమావేశాలు నిర్వహించనున్నామన్నారు. ప్రమాద కేసుల్లో బాధితులు, బీమా సంస్థల ప్రతినిధులు, ఇరుపక్షాల న్యాయవాదులు ఈ సమావేశాల్లో పాల్గొని కేసులు పరిష్కరించుకోవాలన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బీమా సొమ్ము అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 18వ డివిజన్‌లోని 45వ సచివాలయానికి చెందిన బల్ల దుర్గాప్రసాద్‌కు మంగళవారం వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలను సచివాలయ కన్వీనర్లు దమ్ము ప్రసాద్, వరలక్ష్మి, పడమటి కామరాజు అందజేశారు. ఈ నెల 26వ తేదీన చొప్ప పార్వతి గుండెపోటుతో మృతి చెందారు. ఆమె నామిని అయిన మేనల్లుడు బల్లా దుర్గాప్రసాద్‌కు సొమ్ము అందించినట్టు సచివాలయ సంక్షేమ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. వలంటీర్ ఎస్.డేవిడ్ రాజు, స్థానికులు పాల్గొన్నారు.

అర్హుల ఇంటి ముంగిటకే సంక్షేమం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- వెంకాయమ్మపేటలో పర్యటన



వెంకాయమ్మపేటలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మంత్రి వేణు



గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో వెంకాయమ్మపేటలో పర్యటిస్తున్న మంత్రి వేణు

కడియం: ముఖ్యమంత్రి జగన్ పాలనలో సంక్షేమ పథకాలు నేరుగా అర్హుల ఇంటి ముంగిటకే చేరుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, పౌరసంబంధాల శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియపులంక పంచాయతీ పరిధి వెంకాయమ్మపేటలో మంగళవారం ఉదయం ఆయన గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకే అందుతున్నాయన్నారు. పాలనా సంస్కరణల్లో భాగంగంగానే ఈ రెండు వ్యవస్థలను జగన్ ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వెంకాయమ్మపేట సచివాలయం- 4ను మంత్రి సందర్శించారు. ప్రజాసేవే లక్ష్యంగా వ్యవస్థలను సృష్టించే నాయకుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. గత ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తే, జగన్ చేసిన వాగ్దానాలను అమలు చేసి చరిత్రలో నిలిచారన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన 86 ఏళ్ల కొల్లి అప్పలనాయుడితో మాట్లాడి పెన్షన్, తదితర వాటిపై ఆరా తీశారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి ఈవోపీఆర్‌డీ లక్ష్మి, ఎంపీటీసీ అయితరెడ్డి మంగతాయారు, స్థానిక నాయకులు గండి పార్వతి, పులిదిండి రాజు, ఊటుకూరి శైలజ, టేకి శ్రీను, చిలుకూరి రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను పాల్గొన్నారు.

స్వచ్ఛత మన బాధ్యత

పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని మంత్రి వేణు అన్నారు. వెంకాయమ్మపేటలో మంగళవారం స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రజారోగ్య రక్షకులన్నారు. నియోజకవర్గాన్ని పారిశుధ్యంలో రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి, ఫొటోలను తనకు పంపించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం రూ.2.70 కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా నిర్మిస్తున్న కడియం- కడియపులంక రోడ్డు పనులను పరిశీలించారు.

ఆ వైద్యుల సేవలు చిరస్మరణీయం

- ఎంపీ, సిటీ కో ఆర్డినేటర్ భరత్‌రామ్
- కరోనా సమయంలో ప్రాణాలు కోల్పోయిన డాక్టర్లకు నివాళి



వైద్యుల ర్యాలీలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు: మనకు కనిపించే దైవం వైద్యుడని, రోగుల ప్రాణాలను కాపాడేందుకు వారు నిరంతరం మృత్యువుతో పోరాటం చేస్తారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. కరోనా సమయంలో వైద్య సేవలందిస్తూ ప్రాణాలు కోల్పోయిన డాక్టర్లకు నివాళులర్పిస్తూ మంగళవారం నగరంలో వైద్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో భరత్‌రామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నగరంలోని రామాలయం సెంటర్ నుంచి సుబ్రహ్మణ్యం మైదానం వరకూ ఈ ర్యాలీ సాగింది. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యులు ధైర్యంగా తమ సేవలు అందించి వేలమంది ప్రాణాలు కాపాడారన్నారు. సమాజంలో వైద్యులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, వారికి ప్రజా ప్రతినిధులు పూర్తి స్థాయిలో భరోసా ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యులకు, వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో 16 ప్రభుత్వ వైద్య కళాశాలలు మంజూరయ్యాయని, వీటిలో మూడు కేంద్ర ప్రభుత్వ నిధులతోనూ, మిగిలినవి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికే రాజమహేంద్రవరంతో సహా ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వైద్య విద్యాబోధన ప్రారంభమైందన్నారు. పార్టీ అర్బన్ మాజీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఎందరో వైద్యులు ప్రాణాలు కోల్పోయారని, వారందరికీ నివాళులర్పించడానికి ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ విజయ్ భాస్కర్, పలువురు వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో కాలనీకి ఆర్టీసీ బస్సు సర్వీసు



టిడ్కో కాలనీలో ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు టిడ్కో కాలనీ వాసుల కోరిక మేరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్టు వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. మంగళవారం ఉదయం టిడ్కో గృహ సముదాయం వద్ద ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడ్కో కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్టు తెలిపారు. తాగునీటి సమస్య నేపథ్యంలో నిత్యం రెండు నీటి ట్యాంకర్లను పంపిస్తానన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు టిడ్కో కాలనీ నుంచి ఉదయం 8.30 గంటలకు బయలుదేరి బొమ్మూరు జంక్షన్, బాలాజీపేట, ఐఎల్‌టీడీ, ఐదుబళ్ల మార్కెట్, రైల్వేస్టేషన్, కోటిపల్లి బస్టాండు, గోకవరం బస్టాండు వరకూ వెళుతుందన్నారు. తిరిగి సాయంత్రం 6 గంటలకు గోకవరం బస్టాండు నుంచి టిడ్కో కాలనీకి చేరుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం షేక్ షబ్నం, టిడ్కో ఏఈ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా శ్రీనగేష్, ఎన్వీ శ్రీనివాస్, సోమన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలకు మైదానాలు సిద్ధం



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మైదానాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేసినట్టు కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. ఆ మైదానాలను ఇంజినీరింగ్ అధికారులు, అదనపు కమిషనర్‌తో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ బుధవారం నుంచి జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు. మైదానాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, క్రీడాకారులకు వసతులను పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండు రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకాశరావు ఉన్నారు.

నెల్లిమర్ల అమర వీరులకు నివాళి

ప్రకాశం నగర్: నెలిమర్ల అమర వీరుల ఆశయాలకు సాధనకు కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏపీ రమణ పిలుపునిచ్చారు. ఆర్యాపురం సామిల్లు యూనియన్ ఆఫీస్ వద్ద మంగళవారం నెల్లిమర్ల అమరవీరుల 30వ వర్ధంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ 1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వం తెచ్చిన నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా అక్రమ లాకౌట్ ఎత్తివేయాలని నెల్లిమర్లలో 1994 జనవరి 29న జరిగిన రైలురోకో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐదుగురు కార్మికులు పోలీస్ కాల్పుల్లో మరణించగా, పలువురు గాయపడ్డారన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి కె.జోజి, ఐఎఫ్‌టీయూ నాయకులు డి.శ్రీనివాసరావు, కె.అప్పలరాజు, కె.లాజర్, కె.వెంకటేశ్వర్లు, పి.నరసింహమూర్తి ప్రసంగించారు.

నగదు, వెండి వస్తువుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, వెండి వస్తువులతో పోలీసు సిబ్బంది

కడియం: మండలంలోని పొట్టిలంక వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ మంగళవారం తెలిపారు. ఒక కారులో తరలిస్తున్న రూ.1.50 లక్షలు, మరో కారులో తరలిస్తున్న 6.5 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వెండి వస్తువుల విలువ నాలుగున్నర లక్షల రూపాయలు ఉంటుందని, వీటికి సంబంధించి ఎటువంటి బిల్లులు లేవన్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ అశ్వాక్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

లెప్రసీ బాధితులకు మందుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న ప్రభాకరరావు, శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ లెప్రసీ నివారణ దినోత్సవం సందర్భంగా బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో బాధితులకు మంగళవారం రూ.10 వేలు విలువైన మందులు, టానిక్‌లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. జిల్లా కమ్యూనిటీ పారామెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలన్నారు. అసోసియేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, మండల అధ్యక్షుడు రహమాన్ ఖాన్, మండల కార్యదర్శి మట్టా రమేష్, ఏ.సురేష్ బాబు, కోలా లక్ష్మీనారాయణ, ఎం.జానకి రామయ్య, ఎస్ఎమ్‌పీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుగంటివారిపేటలో వైద్యశిబిరం



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: ఇనుగంటివారిపేట గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, డాక్టర్ ఈ.ఏసురాణి, స్పెషలిస్టులు జి.శాంతి దీపిక, బీఎస్ఎస్ శ్రీనివాస్, కంటి వైద్యుడు కె.సత్యప్రసాద్ 501 మందికి వైద్యసేవలు అందించారు. 61 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 51 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించారు. గతంలో పరీక్షించిన 52 మందికి కళ్లజోళ్లు అందించారు. 20 మందికి ఈసీజీ, 375 మందికి ల్యాబ్ టెస్టులు చేశారు. రోగులకు అవసరమైన మందులను ప్రభుత్వం అందించిన బ్యాగ్‌లలో ఉంచి వాటిని సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ సత్య మదన్‌బాబు, ఉప సర్పంచ్ ఖాదర్ వలీ, కో ఆప్షన్ మెంబర్ ఇబ్రహీం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈవీ శ్రీజ, సీహెచ్‌వో వెంకటరత్నం, ఎంపీహెచ్ఈవో వైస్ రాయుడు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాల సాధనకు కృషి

- స్మరించుకున్న వక్తలు
- మహాత్మునికి వాడవాడలా నివాళి



ధవళేశ్వరంలో గాంధీకి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కడియం: గాంధీ మహాత్ముని ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు అన్నారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో మంగళవారం గాంధీ వర్ధంతి నిర్వహించారు. వాడవాడలా ఉన్న ఆయన విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. మహాత్ముడి సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకు మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమగిరి కొండపైగల బుద్ధవిహారాలో గాంధీ విగ్రహానికి ఎస్.శివరామకృష్ణ పుష్పాంజలి ఘటించారు. మహోదయ యాజరా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల నివాళి

ధవళేశ్వరం: పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. గోలి దేవకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, తలారి వరప్రసాద్, ముత్యాల పోసికుమార్, షట్టర్ బాషా, దేవులపల్లి సరితారాణి, ఎన్వీ శేఖర్, బత్రి కామేశ్వరరావు ,శ్రీరంగం బాలరాజు, మోర్త పావనమూర్తి, పేర్ల బాసి, గూటం రాజు, చప్పిడి జ్యోతి పాల్గొన్నారు.

ఆదర్శనీయం

రాజమహేంద్రవరం సిటీ: మహాత్మా గాంధీ చూపిన బాట ఆదర్శనీయమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అన్నారు. కోర్లమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కృష్ణానగర్‌లోని పార్టీ నగర కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ నివాళులు అర్పించారు.

ప్రకాశం నగర్: శ్యామలా సెంటర్‌లోని స్వాతంత్ర సమర యోధుల పార్కులో గల గాంధీ విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్ నివాళులర్పించారు.

న్యూట్రీగార్డెన్స్‌పై మహిళలకు అవగాహన సదస్సు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌లో మహిళలకు న్యూట్రీగార్డెన్స్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూట్రీగార్డెన్, సూర్యమండలం మోడల్‌పై అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు తమ ఇంటి ఆవరణలో 9 నుంచి 12 రకాల ఆకుకూరలు, కాయగూరలు పెంచుకోవడం ద్వారా నిరంతర ఆదాయం, ఆరోగ్యకరమైన ఆహారం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైగా ఆనంద్ కుమార్

మధురపూడి: కోరుకొండ ఎస్సైగా డి.ఆనంద కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జగ్గయ్యపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడతామని, నేరాలను అదుపుచేసే కార్యక్రమంలో భాగంగా యువతకు అవగాహన కల్పిస్తామన్నారు.